


# నవభూమి

## జిల్లా అనుబంధం

07 మార్చి ,2025 శుక్రవారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


# లక్కినేని సురేందర్ సొసైటీ చైర్మన్ పదవి


- ❑ ఆరు నెలలు పొడిగింపు
- ❑ ఉత్తర్వులు వెలువరించిన స్పెషల్ డిప్యూటీ రిజిస్ట్రార్



**టేకులపల్లి మార్చి 6 నవభూమి ప్రతినిధి:** బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ పదవీ కాలాన్ని ఆరు నెలలు పొడిగించబడింది. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కో ఆపరేటివ్ స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు వెలువరించారు. టేకులపల్లి మండలంలో ఒకే ఒక బేతంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఏసిఎస్) కలదు. 2020 ఫిబ్రవరి 15న పిఏసిఎస్ కు జరిగిన ఎన్నికల్లో లక్కినేని సురేందర్ సొసైటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కాగా ఆయన పదవి కాలం ఐదు సంవత్సరాలు. ఈ ఏడాది ఫిబ్రవరి 14వ తేదీతో పదవీకాలం ముగిసింది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పిఏసిఎస్ చైర్మన్‌ల పదవీకాలం 6 నెలలు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దానిలో భాగంగా బేతంపూడి పిఏసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్ తో సహా 12 మంది డైరెక్టర్ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ జిల్లా కోపరేటివ్ స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పొడిగించిన జీవో కాపీ ఉత్తర్వులు చైర్మన్ లక్కినేని సురేందర్‌కు చేరాయి.

# సుజాతనగర్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

- ❑ ఫలించిన ఎమ్మెల్యే కూనంనేని కృషి
- ❑ ఇంటర్మీడియట్ విద్య ఇక మండల కేంద్రంలోనే
- ❑ హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు



**కొత్తగూడెం మార్చి 6 నవభూమి ప్రతినిధి:** సుజాతనగర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పదో తరగతి విద్య అనంతరం మండలంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులు కొత్తగూడెం, పరిసర ప్రాంతాల్లోని జూనియర్ కళాశాల్లో చేరి ఇబ్బందులు పడే పరిస్థితులు, ఆర్థికంగా నష్టపోతుండటంతో స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు కృషిని ప్రారంభించారు. ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు, ఇంటర్మీడియట్ విద్య అధికారులను సంప్రదించి వత్తిడి తేవడంతో కళాశాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇటీవల కళాశాల ఏర్పాటు ప్ర క్రియ ప్రారంభించాలని ఇంటర్మీడియేట్ విద్య డైరెక్టర్ నుంచి ఉన్నత విద్య ప్రిన్సిపాల్ సెక్రటరీ లేఖ రాశారు. దేంతో ఎమ్మెల్యే కూనంనేని కృషి ఫలించినట్లైంది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం, ఇంటర్మీడియట్ విద్యాశాఖ సుముఖత వ్యక్తం చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పోలీస్ స్టేషన్‌లోనే లారీడ్రైవర్ ఆత్మహత్యాయత్నం

- ■ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన లారీ డ్రైవర్ జీవన్‌కుమార్
- ■ వీఎం బంజర పోలీసు స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- ■ తనపై దాడి చేసి చిత్ర హింసలు పెట్టారని ఆరోపిస్తూ స్టేషన్ పైకి ఎక్కి అక్కడి నుంచి దూకేసిన డ్రైవర్ జీవన్
- ■ ఆసుపత్రికి తరలించిన పోలీసులు..డ్రైవర్ పరిస్థితి విషమం




**ఖమ్మం-నవభూమిబ్యూరో:** పోలీస్ స్టేషన్ పైనుంచి లారీ డ్రైవర్ దూకిన ఘటన ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజర్ కాలనీలో చోటు చేసుకుంది. పెనుబల్లిలో పోలీసులు ఇవాళ(ఆదివారం) డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలు వాహనాలను ఆపి వారికి టెస్టులు చేశారు. అతిగా మద్యం తాగి పట్టుపడిన వారిని కౌన్సిలింగ్ నిమిత్తం స్టేషన్‌కు తరలిస్తున్నారు.
అయితే అదే సమయంలో డ్రైవర్ జీవన్ కుమార్ తన లారీ నడుపుకుంటూ పోలీసులు తనిఖీలు చేసే మార్గానికి వెళ్లాడు. జీవన్ పూటుగా మద్యం సేవించి ఉండడాన్ని గమనించిన పోలీసులు అతనికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేశారు. దీంతో అతను పరిమితికి మించి మందు తాగినట్లు గుర్తించారు. ఈ క్రమంలో అతన్ని వీఎం బంజర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే పోలీసులు తనపై దాడి చేసి చిత్రహింసలు పెట్టారని ఆరోపిస్తూ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్టేషన్ భవనం పైకి ఎక్కి అక్కడ్నుంచి ఒక్కసారిగా దూకేశాడు. దీంతో బాధితుడికి తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన పోలీసులు అతన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. వెంటనే విషయాన్ని జీవన్ కుటుంబసభ్యులు, బంధువులకు తెలియజేశారు. దీంతో వారంతా ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబసభ్యులు బాధితుడిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా, డ్రైవర్ జీవన్ కుమార్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో పోలీసుల్లో ఆందోళన నెలకొంది.

## మహిళా శక్తికి

# అరుదైన గౌరవం

- ■ మైనింగ్‌లో సత్తా చాటిన అతివలకు సన్మానం
- ■ హాజరైన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి
- ■ రాష్ట్ర స్త్రీ ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- ■ కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబె
- ■ సింగరేణి సంస్థ సీఎం డిఎన్ బలరామ్ ఆధ్వర్యంలో సింగరేణిలో మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణ




**కొత్తగూడెం మార్చి 6 నవభూమి ప్రతినిధి:**-అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బొగ్గు గనుల్లో పనిచేస్తూ ప్రత్యేక ప్రతిభ కనబరిచిన ఉత్తమ మహిళా ఉద్యోగులు, అధికారులను హైదరాబాద్ లో గురువారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, తెలంగాణ రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క ), సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో సింగరేణి సంస్థలో మైనింగ్ అధికారులుగా భూ గర్భ గనుల్లో విధులు నిర్వర్తిస్తున్న మైనింగ్ అధికారులు అంబటి మౌనిక (పీవీకే 5 ఇంక్లైన్), అల్లం నవ్య శ్రీ (జీడీకే 11 ఇంక్లైన్)లను కూడా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంకిత భావంతో పనిచేస్తున్న మహిళా అధికారులను సీఎండీ ఎన్.బలరామ్ ప్రశంసించారు. భవిష్యత్ లో సింగరేణి లో మరిన్ని అవకాశాలు కల్పిస్తామన్నారు.





నాలుగు లైన్ల రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఉపముఖ్యమంత్రి 3

## నేటి నుంచి గార్లలో మణుగూరు ఎక్స్ ప్రెస్ రైలు హాల్ట్




**గార్ల, నవభూమి, మార్చి 6:** సికింద్రాబాద్ నుండి మణుగూరు వెళ్లే మణుగూరు ఎక్స్ ప్రెస్ రైలు శుక్రవారం నుంచి గార్ల రైల్వేస్టేషన్ లో నిలుపుదల చేస్తూ దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. సుమారు ఏడాది గా నడుస్తున్న మణుగూరు ఎక్స్ ప్రెస్ రైలును రైల్వే అధికారులు గత నెల 17వ తేదీ నుంచి అర్థాంతరంగా గార్ల రైల్వేస్టేషన్ లో నిలుపుదల నిలిపివేశారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా గార్ల లో మణుగూరు ఎక్స్ ప్రెస్ రైలు హాల్ట్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని మండల అఖిల పక్షం నాయకులు, ప్రయాణికుల కమిటీ సభ్యులు దక్షిణ మధ్య రైల్వే శాఖ సికింద్రాబాద్ డివిజన్ అధికారులకు, పలువురు పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తులు చేశారు. దీంతో దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు స్పందించి గార్ల రైల్వేస్టేషన్ లో నిలుపుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు. దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు, అఖిల పక్షం నాయకులు, ప్రయాణికుల కమిటీ సభ్యులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## వరంగల్ కాకతీయ యూనివర్సిటీ ప్రకటించిన సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో ప్రతిభ కళాశాల విద్యార్థులకు ర్యాంకులు



**కల్లూరు, నవభూమి, మార్చి 5:** కాకతీయ యూని వర్సిటి వరంగల్ ప్రకటించిన సెమిస్టర్ పరిక్షా ఫలితాలలో ప్రతిభ కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించారు. జి నవ్య (బి ఎస్ సి బీ జెడ్ సి) లో 9.01 ఎస్ జి పి ఏ, ఆర్ ఉమారాణి (బీఎస్సీ ఎం సి సి ఎస్) లో 8.67 ఎస్ జి పి ఏ, ఎస్ కే రఫీ పాషా (బీకాం సిఏ) లో 7.61 ఎస్ జి పి ఏ, పి శివశంకర్ 7.35 ర్యాంకును సాధించారు. విద్యార్థులను కల్లూరు ప్రతిభ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ %ు% కరస్పాండెంట్ లక్కినేని రఘు, ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ లక్కినేని ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్స్ పల్ రామల ప్రసాద్ రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి నాగేశ్వరరావు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

## పుష్పాల వారి వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

**ములకలపల్లి మార్చి 6 నవభూమి:** ములకలపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న పుష్పాల శ్రీదేవి - వెంకన్న దంపతుల కుమార్తె భార్గవి వివాహ వేడుకలో ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూపా భాస్కర్, కల్లూరి కిషోర్, మండల కార్యదర్శి కోర్స రామకృష్ణ, కారేపల్లి మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, మండల కమిటీ సభ్యులు శాస్త్రభోయిన వెంకటేశ్వర్లు, పుష్పాల రామారావు, పుష్పాల చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# స్త్రీసమాన పనికి - సమాన వేతనానికై ఉద్యమించాలి

### ■ పిఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు వీరమళ్ళ ఉమ




**పాల్వంచ మార్చి 6 నవభూమి ప్రతినిధి:** పాల్వంచ మండలం రెడ్డిగూడెం గ్రామంలో పిఓడబ్ల్యూ మండల నాయకురాలు జ్యోతి అధ్యక్షతన గ్రూప్ మీటింగ్ ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు కామ్రేడ్ వీరమళ్ళ ఉమ రెడ్డిగూడెం గ్రామంలో జరిగిన గ్రూప్ మీటింగులనుద్దేశించి మాట్లాడుతూ మార్చి 8 శ్రామిక మహిళల పోరాట దినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రదర్శనలు, ధర్నాలు, సదస్సులు నిర్వహించాలని ఆమె పిలుపునిచ్చారు. స్త్రీ-పురుష సమానత్వంకై పోరాడాలని, ఆధిపత్య పితృస్వామ్య భావజాలాన్ని వ్యతిరేకించాలని, సమాన పనికి - సమాన వేతనంకై ఉద్యమించాలని, కగార్ పేరుతో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న మారణకాండను తక్షణమే ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలుకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్త్రీ,ఆర్థికంగా రాజకీయంగా సాంఘికంగా సాంస్కృతికంగా అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణించాలని అప్పుడే, స్త్రీ జాతి అభివృద్ధి వైపు ప్రయాణిస్తుందని అన్నారు. కానీ పాలక ప్రభుత్వాలు మహిళలను ఆట బొమ్మల చూస్తున్నారే,తప్ప వారి హక్కులను పూర్తిగా హరిస్తూ పురుష ఆధిపత్య భావజాలంతో స్త్రీ ని వంటింటి కుందేలుగా బంధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను, నర్సుల సమస్యలను, మున్సిపల్ వర్కర్ల సమస్యలను, పాకి పనిచేసే మహిళల సమస్యలను, భవన నిర్మాణ రంగంలోని మహిళల సమస్యలను, ఇతర అన్ని రంగాలలో పనిచేస్తున్న మహిళల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని, అందుకోసం ప్రతి ఒక్క మహిళ పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా, గృహ హింసలకు వ్యతిరేకంగా, వరకట్నపు వేధింపులకు వ్యతిరేకంగా, ఇతర అన్ని రకాల హింసలకు వ్యతిరేకంగా, ఇతర కుల, వర్గ, జెండర్కు వ్యతిరేకంగా నిత్యం పోరాడాలన్నారు. దశాబ్దాలుగా శ్రామిక మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి మార్చి 8 ని పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు వీరమళ్ళ ఉమ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బుడిగం కొమరమ్మ, కళ్లెం పద్మమ్మ, సోమ కలమ్మ, దార పద్మ, జక్కుల గంగమ్మ, జక్కుల శైలజ, మడవి గంగా, విడమి సుజాత, బుర్ర జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

### ■ సన్నాక సమావేశంలో వీసంశెట్టి పద్మజ



**పాల్వంచ మార్చి 6 నవభూమి ప్రతినిధి:** ఈ నెల ఎనిమిదిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జరగనున్న వేడుకలను జయప్రదం చేయాలని మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీసంశెట్టి పద్మజ కోరారు. గురువారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ లో మహిళా సమాఖ్య ముఖ్య కార్యకర్తలతో మహిళా దినోత్సవ వేడుకల సన్నాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఆనాడు మహిళల పరిస్థితులు ఎంతో దయనీయంగా ఉన్న పరిస్థితుల్లో మహిళా హక్కులకై, ఎనిమిది గంటల పని దినాలకై, ఓటు హక్కుకై, పని ప్రదేశాలలో మౌలిక సదుపాయాలకోసం, కనీస వేతనాల ఆనాడు మహిళా నాయకురాలు 50 దేశాల కమ్యూనిస్టు నాయకురాళ్లు ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్నటువంటి అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8ని అన్నారు. మార్చి 8ని మహిళా హక్కుల సాధన దినోత్సవం గా ప్రపంచ దేశాల్లోని మహిళలు జరుపుకుంటున్నారునీ, ఇప్పటికీ మహిళలు రెండవ తరగతి పౌరురాలుగా మన దేశంలో ఉన్నదిని, మహిళా సాధికారత అని చెప్తున్నటువంటి ప్రభుత్వాలు మహిళలకి బడ్జెట్లో, నిధులు కేటాయింపుల్లో వివక్ష చూపడం జరుగుతుదని విమర్శించారు. 33 రిజర్వేషన్ కల్పిస్తామని, దాన్ని 2026 అమలు చేస్తావని మాయమాటలు చెబుతున్నటువంటి దుర్మార్గ కేంద్ర ప్రభుత్వ విధానాల్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు గాలి పద్మ, దాసరి లక్ష్మి, కమటం ఈశ్వరమ్మ, వగ్గేలా పద్మ, భాను, సత్తెమ్మ అనసూర్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో ఓబీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించండి

### ■ టియుసిఐ నేతల డిమాండ్






**సత్తుపల్లి, నవభూమి, మార్చి 7 :** సింగరేణి ఓబి ఆపరేటర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీ యు సి ఐ ) నాయకులు కోరారు. సత్తుపల్లి సింగరేణి ఓబి కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఏ వెంకన్న, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి సివై పుల్లయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ శరత్ డిమాండ్ చేశారు. గురువారం సత్తుపల్లిలో టీ యు సి ఐ కార్యాలయం లో సింగరేణి ఓబి కాంట్రాక్ట్ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ, సింగరేణి ఓబి కాంట్రాక్టు కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. వారికి ప్రతి నెల 10వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలన్నారు. ఈపీఎఫ్ జీతంలో కట్ కాగానే మొబైల్లో మెసేజ్లు పంపించాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు చెల్లించ్చే వేతనాలను వీరికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఎల్సి రాష్ట్ర ఉపాధ్యక్షులు కే రవి మాట్లాడుతూ, ఓబీలో కాంట్రాక్టు కార్మికులు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారన్నారు. వారికి ఆరోగ్య చెకప్ చేయించాలన్నారు. వేతనంతో కూడా సెలవులు ఇవ్వాలని కోరారు. అనంత ఓబీ ఆపరేటర్ల నూతన కార్యవర్గ తీర్మానాన్ని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీఅమర్లపూడి శరత్ ప్రవేశపెట్టడం జరిగింది. అధ్యక్షులు గా వెంకటేష్ ఉపాధ్యక్షులుగా కె కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా పి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ఎం రాజా, కోశాధికారిగా వి. అశోక్ తో పాటు పదిమందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బి రమేష్ రవికుమార్ మురళీకృష్ణ ప్రసాద్ రవి బాలరాజు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన



**పాల్వంచ టౌన్ మార్చి 6 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశ్వాపురం జగన్నాధపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం ( పెద్దమ్మ గుడి) లో గురువారంను పురస్కరించుకొని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎన్. రజినీకుమారి ఆదేశాల మేరకు అమ్మవారికి 108 సువర్ణ పుష్పములతో వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి హారతి మంత్రపుష్పం నివేదన తదితర ప్రత్యేక పూజలు అర్చకులచే నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం వాసి కంచి జవహర్ జోకి డాక్టరేట్





**కొత్తగూడెం మార్చి 6 నవభూమి జిల్లా బ్యూరో:**-కొత్తగూడెం కి చెందిన సెయింట్ పీటర్స్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ జవహర్ జో ఏసిఈ థియోలజికల్ ఓపెన్ యునివర్సిటీ హైదరాబాద్ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. వైస్ చాన్సలర్ విజయ్ మోహన్ రావు ఆధ్వర్యాన జరిగిన విశ్వాసం, అనుభవం, పరిశోదనాత్మక గ్రంధానికి డాక్టరేట్ ప్రకటించారు. కాగా కంచి జవహర్ జో ని, హెన్నా ని పలువురు పాఠశాల ఉపాధ్యాయులు, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నాయకులు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## పేద విద్యార్థిని ఉన్నత చదువుల కోసం

### వెంపటి నరసింహారావు, అనసూయమ్మ

### జ్ఞాపకార్ధంగా ఆర్థిక సహాయం



**పాల్వంచ మార్చి 6 నవభూమి ప్రతినిధి:** ఉన్నత చదువులు పేద విద్యార్థులు దూరం కాకూడదన్న లక్షంతో సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు విద్యార్థుల చదువులకు అయ్యే ఖర్చులను వారి మామ, అత్త అయినా వెంపటి నరసింహారావు, అనసూయమ్మ జ్ఞాపకార్ధంగా ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని మునిసిపల్ డి ఈ స్వరూపరాణి అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని రాంనగర్ ప్రాంతానికి చెందిన బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న తిరుమలరావు పేద విద్యార్థి కావడంతో చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిసి స్వరూపరాణి చేతుల మీదుగా విద్యార్థి తల్లిదండ్రులకు పదివేల రూపాయలు అందజేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ అడుసుమల్లి సాయిబాబు అనేక మంది పేద విద్యార్థులకు సాయం చేయడం గొప్ప విషయంనీ అన్నారు. పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని నాలుగు సంవత్సరాలకుగాను ప్రతి సంవత్సరం పదివేల రూపాయలు సహాయం అందజేయడం చాలా సంతోషకర అన్నారు. ఈ సందర్భంగా సాయిబాబును ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని సందర్భంగా సాయిబాబా ను స్వరూపరాణి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, నాయకులు శనగారపు శ్రీనివాసరావు, మన్నెం వెంకన్న,బి వి సత్యనారాయణ, జకరయ్య, పద్మ, లక్మి, ఆదినారాయణ, శంకర్, వెంకన్న, శ్రీనివాస్, వేంకటేశ్వర్లు, అల్లి వేంకటేశ్వర్లు, టిడిపి నాయకులు నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి నవాహ్నిక ప్రతిష్ఠ మహోత్సవాలు

- వేదమంత్రార్చనలతో ప్రారంభం
- 9న ఆలయ, విగ్రహ ప్రతిష్ట
- రోడ్ నెం.7 ద్వారకాపురి కాలనీలో కార్యక్రమం



**సత్తుపల్లి, నవభూమి, మార్చి 6 :** పట్టణ పరిధిలోని ద్వారకాపురి కాలనీ రోడ్ నెంబర్ 7 లో మార్చి 9వ తేదీన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని నవాహ్నిక ( తొమ్మిది రోజుల) పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రతిష్ట మహొూత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వహణ కమిటీ సన్నాహాలు పూర్తి చేసింది. శ్రీ క్రోధి నామ సంవత్సర పాల్గొన్న మాస శుద్ధ పార్టీ నుండి పాల్గొన శుద్ధ దశమి వరకు విశేష పూజలు యజ్ఞ యాగాదులు నిర్వహిస్తున్నారు. మార్చి 9వ తేదీ ఆదివారం ఉదయం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి నూతన ఆలయం ప్రారంభంతోపాటు శిఖర, శిలా విగ్రహ, ఉత్సవ విగ్రహా దారు ధ్వజస్తంభ ప్రతిష్టా మహొూత్సవాలు నవాహ్నిక పంచకుండాత్మకంగా శ్రీ పాంచరాత్ర దివ్య ఆగమొక్తముగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. స్థలదాత, ఆలయ వ్యవస్థాపక శాశ్వత అధ్యక్షులుగా ఉన్న రాగాల చంద్రారెడ్డి, సత్యవతి దంపతులకు 2002 సంవత్సరం విజయదశమి రోజున శ్రీ వెంకటేశ్వర స్వామి కలలో కనిపించి ఆలయం నిర్మించాలని ఆజ్ఞాపించినట్టు తెలిసింది. అప్పటికే ఆ స్థలంలో పెద్ద పుట్ట ఉండటంతో దానిని తొలగించి స్థలాన్ని శుభ్రపరిచి ఆలయ నిర్మాణానికి సంకల్పం చేశారు. ఐదు అడుగుల శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని మంగళగిరి నుంచి తీసుకువచ్చి తాత్కాలిక ఆవాసం ఏర్పరిచి నిత్య పూజ, దీప, ధూప నైవేద్యాలు భక్తుల సహకారంతో ఏర్పాటు చేస్తూ వచ్చారు. సొంత ధనంతో పాటు దాతలు ఇచ్చిన విరాళాలతో ఆలయ నిర్మాణం ఇంత కాలానికి పూర్తి చేయగలిగారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళ శాసనములతో ప్రతాపురపు గిరిధరాచార్యులు ప్రతిష్ట మహొూత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయ నిర్మాణ కర్తలుగా స్థల దాత, ఆలయ వ్యవస్థాపక శాశ్వత అధ్యక్షులు రాగాల చంద్రారెడ్డి, ఆలయ నిర్మాణ పర్యవేక్షకులుగా ద్రోణంరాజు వెంకట సుబ్రహ్మణ్య మల్లికార్జున శర్మ,






నాగమణి, ట్రస్ట్ చైర్మన్ గా సోమిశెట్టి శ్రీధర్ల ఆధ్వర్యంలో ప్రతిష్ట నిర్వాహ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్గా వందనపు సత్యనారాయణ ( ఇండియన్ గ్యాస్), వైస్ చైర్మన్లు గా తోట కిరణ్, గాదే నాగు, వీరిశెట్టి ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఉబ్బల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ధూళిపాల రాంబాబు, వంగరి రాజేష్, కోశాధికారిగా రాగాల రమేష్ రెడ్డి, సహాయ కోశాధికారిగా సముద్రాల దామోదర్ రావు, కమిటీ సభ్యులుగా గుండు శ్రీనివాసరావు, వెనిగళ్ళ మహేష్, మల్లీ రెడ్డి రామ్మోహన్ రెడ్డి, గంద్ర విజయ సారథి, దుశేటి శ్రీనివాస్, పామర్తి రాము, చిలమకూరి కృష్ణయ్య, గరిడేపల్లి నాగార్జున, పాలపాటి శ్రీనివాస దుర్గా చంద్ర ప్రసాదరావు, పత్తి సత్యసాయి వరప్రసాద్, మారోజు సూర్య ప్రకాష్, దాయక దుర్గారావు, మరీదు అనిల్ కుమార్, ఇస్లావత్ వెంకటేశ్వరరావు లు సభ్యులుగా ఉన్నారు. ఆలయ ప్రారంభం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దయానంద్ విజయకుమార్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుక చౌదరి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, టి జి ఐ డి సి చైర్మన్ మువ్వ విజయబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్పర్సన్ తోట సుజల రాణి గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, జేవియర్, కిష్టారం ఓసి పిఓలు ఎన్ వి ఆర్ ప్రహ్లాద్, ఎంవీ నరసింహారావు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ప్రతిష్ట మహొూత్సవ కార్య నిర్వహణ కమిటీ సభ్యులు వెల్లడించారు.

### నాలుగు లైన్ల రహదారి

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఉపముఖ్యమంత్రి

- ఆర్థిక, ఇంధన శాఖామాత్యులు భట్టి విక్రమార్క మల్లు
- రెండు లైన్ల రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరణ



**ఖమ్మం నవభూమి బ్యూరో, మార్చి 06:** ముదిగొండ నుంచి వల్లభి వరకు నాలుగు లైన్ల రహదారి అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి గురువారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ముదిగొండ పట్టణ పరిధిలో ముదిగొండ నుంచి వల్లభి వరకు 5 కిలో మీటర్ల మేరకు ప్రస్తుతం ఉన్న రెండు లైన్ల రహదారిని 28 కోట్ల రూపాయల ప్లాన్ నిధుల అంచనా వ్యయంతో నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలని ప్రభుత్వం





నిర్ణయించిందని, ఈ నిధులతో రహదారి విస్తరణతో పాటు డ్రైనేజి, ఫుట్ పాత్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రోడ్లు, భవనాలు శాఖ ఎస్ఇ హేమలత, ఇఇ యుగంధర్ రావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నాగరాజును పరామర్శించిన మాజీ ఎంపీ మిడియం బాబురావు




**భద్రాచలం మార్చి 6 నవభూమి ప్రతినిధి:** సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు,కార్మిక సంఘం సీ ఐ టి యు నాయకులు నకరికంటి నాగరాజు ఇటీవల అనారోగ్యానికి గురై ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది వచ్చిన నేపథ్యంలో సిపిఎం రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు, మాజీ డిసిసిబి చైర్మన్ యలమంచి రవికుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి, పార్టీ పట్టణకార్యదర్శి గడ్డం స్వామి లు పరామర్శించడం జరిగింది. గత రెండు నెలలుగా లివర్ ఇన్ఫెక్షన్ తో బాధపడుతూ కొద్దిరోజులుగా ఖమ్మం ప్రైవేటు హాస్పిటల్ లో చికిత్స పొంది వచ్చిన సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు నగరికంటి నాగరాజును నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పడం జరిగింది అని అన్నారు.

## నిషేధిత మావోయిస్టు పార్టీకి సహకరించవద్దు

### ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్





**చర్ల మార్చి 6 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని బట్టిగూడెం, రామచంద్రాపురం గ్రామాల్లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ లో పాల్గొన్న భద్రాచలం ఏఎస్పీజిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చర్ల పోలీసులు, సిఆర్పిఎఫ్ అధికారులతో కలిసి భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ గురువారం చర్ల మండల పరిధిలోని ఏజెన్సీ గ్రామాలైన బట్టిగూడెం, రామచంద్రాపురంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ రెండు గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి ఎవరూ సహకరించవద్దని గ్రామస్తులకు సూచించారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. పరోక్షంగానైనా, ప్రత్యక్షంగానైనా నిషేధిత మావోయిస్టు పార్టీకి సహకరించిన వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్న పోలీస్ శాఖ తరపున అట్టి సమస్యలను సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్ కుమార్, చర్ల సిఐ, రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి, కేశవ్, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ రామనవమి, పట్టాభిషేక సన్నాహక సమావేశం

■ పాల్గొన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్







**భద్రాచలం మార్చి 6 నవభూమి ప్రతినిధి:** గురువారం నాడు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరములో శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణం, పట్టాభిషేకం మహోత్సవాలకు చేపట్టవలసిన కార్యాచరణపై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు విజయవంతంగా జరగడానికి అధికారులు కలిసికట్టుగా ఉండి విధులు ఎలా నిర్వహించాలో మిథిలా స్టేడియంలో జరుగు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం మరియు పట్టాభిషేకం మహోత్సవాలు జరగడానికి నెల రోజుల సమయం ఉన్నందున అందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి అప్పగించిన పనులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. కళ్యాణం వీక్షించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేడుకలు వీక్షించేందుకు భక్తులు ఒక సెక్టార్ నుంచి వేరే సెక్టార్ కి వెళ్లకుండా పటిష్ట భారీకేడ్లు ఏర్పాటు చేయాలని అలాగే భక్తులకు ఆన్లైన్ ద్వారా 75 శాతం టిక్కెట్లు కేటాయించాలని, 25 శాతం మాన్యువల్ గా అందుబాటులో ఉంచుకోవాలని దేవస్థానం ఈవో కు సూచించారు. అలాగే లాడ్జిలు బుక్ చేసుకునే విధంగా సౌకర్యం కల్పించాలని, అవసరమైతే పోలీస్ సహకారం తీసుకోవాలని, సెక్టర్ లలో భారీకేడ్లు నిర్వహణ ఆర్ అండ్ బి మరియు పోలీస్ శాఖ వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని భారీ కేడ్లు పటిష్టంగా జరిగేలా చూడాలని, నాసిరకంగా భారీకేడ్ల నిర్వహణ చేసే ఏజెన్సీలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కళ్యాణం మరియు పట్టాభిషేకం విధుల నిర్వహణకు ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించాలని అలాగే విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని, అలాగే వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా టెంపరరీ టాయిలెట్లు మరియు ఐటీసీ ద్వారా నిర్మాణం చేపట్టే టాయిలెట్లు ఈనెల 31 వరకు పూర్తయ్యేలా చూడాలని,ముఖ్యంగా మంచినీటి సరఫరా విషయంలో ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని మంచినీటి సరఫరా పర్యవేక్షణకు మంచినీటి పరీక్షలు నిర్వహణకు సిబ్బందిని నియమించాలని, ప్రతి సెక్టార్కు మంచినీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేయాలని అన్నారు. మిథిలా స్టేడియంలో పర్మినెంట్ గా మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్డబ్ల్యూఎస్, దేవస్థానం డి ఈ కు సూచించారు. అలాగే వాహనాల పార్కింగ్ విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ముఖ్యంగా అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక వాహనాలను ఎస్టీమ్ గిరీష్ పరికరాలను సిద్ధంగా ఉంచాలని అలాగే భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా రిస్కుటీములను అందుబాటులో ఉంచుకోవాలని, భక్తులు గోదారిలోకి వెళ్లకుండా పటిష్ట భారీ భద్రత ఏర్పాటుతోపాటు నాటు పడవలను గజయితగాళ్లను సిద్ధంగా ఉండేలా సంబంధిత అధికారులు చూసుకోవాలని, అలాగే ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. భక్తులు లోతు ప్రాంతానికి వెళ్లకుండా మైకుల ద్వారా అనౌన్స్మెంట్ చేయాలని, అలాగే స్వామివారు కళ్యాణ మండపానికి విచ్చేయుచున్నప్పుడు భక్తుల రద్దీ నియంత్రణకు మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలని అందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, వంతెన పై వాహనాలు ఆగిపోతే తక్షణమే తరలించేందుకు వీలుగా క్రేన్లను సిద్ధంగా ఉంచాలని, 24 గంటలు పని చేయు విధంగా అత్యవసర వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 20 బెడ్లను సిద్ధంగా ఉండేటట్లు చూడాలని, అలాగే ఐసియు వార్డు ఏర్పాటు చేయాలని, ఎండలు ముదురుతున్నందున భక్తులకు వడదెబ్బ తగిలే అవకాశం ఉందని, భక్తులు ఎక్కడపడితే అక్కడ చిరు తిండ్లు తినడం వలన ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉందని అందుకు ఎమర్జెన్సీగా 108 అంబులెన్స్ సరిపడా మందులు, అత్యవసరమైతే సిపిఆర్ చేయడానికి సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. భక్తులు బస్టాండ్ నుండి కళ్యాణం జరుగు ప్రదేశానికి రావడానికి ఆటో చార్జీలు అధికంగా వసూలు చేయకుండా పరిమితికి మించి ఆటోలో ప్రయాణించకుండా చూడవలసిన బాధ్యత సంబంధిత ఆర్టీవో చూసుకోవాలని అన్నారు. అగ్నిమాపక సిబ్బంది కళ్యాణం జరుగు ప్రదేశాలలో ముఖ్యమైన కూడళ్లలో ఫైర్ ఇంజన్లు ఏర్పాట్లు చేయాలని, హోటళ్లలో బయట అమ్మకాలు జరిగే టిఫిన్స్ సెంటర్లలో ఆహారాన్ని ఫుడ్ ఇన్స్పెక్టర్ 24 గంటలు తనిఖీ చేయాలని, దేవస్థానంలో మరియు ప్రసాదం కౌంటర్లలో అమ్మే లడ్డూలను కూడా తనిఖీ చేసి సర్టిఫికెట్ అందించిన తర్వాతనే అమ్మకాలు జరిపే విధంగా చూడాలని అన్నారు. అలాగే కళ్యాణం పట్టాభిషేకం వీక్షించడానికి వచ్చే భక్తులకు వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తలంబ్రాలు, ప్రసాదం పంపిణీ విషయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేయాలని, గతం కంటే ఈసారి ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేసి తలంబ్రాలు, ప్రసాదం అందే విధంగా చూడాలని దేవస్థానం ఈవో కి ఆదేశించారు. భక్తులకు సమగ్ర సమరచారము అందించేందుకు సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిపిఆర్ఓ కు ఆదేశించారు. కళ్యాణం వీక్షించడానికి వచ్చే భక్తుల కొరకు జిల్లా నలుమూలలకు వెళ్లే విధంగా బస్సులు ఏర్పాటు చేయాలని, కళ్యాణం వీక్షించడానికి ప్రముఖులు వచ్చే అవకాశం ఉన్నందున ఆర్ అండ్ బి శాఖ అధికారులు మూడు హెలిపాడ్లను తయారు చేయించి సిద్ధంగా ఉంచాలని, కొత్తగా నిర్మాణం చేపట్టిన బ్రిడ్జి ఎంట్రెన్స్లో దేవస్థానం డిజైన్ లో శిలాఫలకం తయారు చేయించాలని అన్నారు. అలాగే పర్ణశాలలో కూడా కళ్యాణం వీక్షించడానికి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ప్రస్తుతం సీతారామ కెనాల్ పనులు జరుగుతున్నందున భక్తులు గోదావరిలోకి వెళ్లి స్నానాలు చేసే అవకాశం లేనందున షవర్ బాతులు ఏర్పాట్లు చేయాలని, భద్రాచలంలో స్వామివారి కల్యాణానికి చేస్తున్న ఏర్పాట్లు మాదిరిగానే పర్ణశాలలో కూడా చేయాలని అధికారులకు సూచించారు. సంబంధిత అధికారులు సీతారామచంద్రస్వామి కళ్యాణము మరియు పట్టాభిషేకము అయిపోయే వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తో పాటు వివిధ శాఖల అధికారులు సిబ్బంది అందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కల్యాణ వేడుకలు విజయవంతం అవ్వడానికి కృషి చేయాలని ఆయన అన్నారు. అనంతరం ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం వీక్షించడానికి వచ్చే భక్తులకు శానిటేషన్ పరంగా ప్రత్యేక చర్యలు చేపడతామని, ఉదయం సాయంత్రం గ్రామపంచాయతీ సిబ్బందిని 24 గంటలు అందుబాటులో ఉంచుకొని పారిశుధ్య కార్యక్రమాలు చేయిస్తామని, అలాగే టెంపరరీ టాయిలెట్లు పర్మినెంట్ టాయిలెట్లు నిర్వహణ సక్రమంగా జరిగేలా గ్రామ పంచాయతీ తరపున చూస్తామని, కళ్యాణం మరియు పట్టాభిషేకం అయిపోయే వరకు ఐటిడిఏ కార్యాలయంలోని యూనిట్ అధికారులను అప్రమంతంగా ఉంచి సక్రమంగా విధులు నిర్వహించేలా చూస్తామని, ఐటీడీఏ ప్రాంగణంలో ముస్తాబు చేస్తున్న గిరిజన ఆచార వ్యవహారాలు సాంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించిన ప్రారంభించడానికి సన్న హాలు చేస్తున్నామని, అలాగే ముక్కోటి ఏకాదశి సమయంలో గిరిజన మహిళల యొక్క స్టాల్స్ ఏర్పాటు చేసి గిరిజన వంటకాలు మరియు మిల్లెట్ బిస్కెట్లు కోయకల్చర్ కు సంబంధించిన కళాఖండాలు నాయకపోడు కల్చర్ కు సంబంధించిన ప్రతిమలు, భక్తులకు విక్రయించేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం మరియు పట్టాభిషేకం విజయవంతంగా జరిగేలా మా శాఖ తరపున దాదాపు రెండువేల మంది పోలీసులతో అన్నిచోట్ల ప్రతిష్ట భారీ బందోబస్తుతో పాటు భక్తులకు సహాయ సహకారాలు అందించే విధంగా కృషి చేస్తామని, కళ్యాణం జరుగు మిథిలా స్టేడియం మరియు పార్కింగ్ ప్లేస్, భక్తులు సేద తీరే ప్రదేశాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామని అన్నారు. అనంతరం ఈనెల 8వ తారీఖు నాడు జరిగే మహిళా దినోత్సవానికి సంబంధించిన పోస్టర్ను అధికారుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏ ఎస్ పి రోహిత్ రాజ్, డి ఆర్ డి ఓ విద్యాచందన, ఆర్డీవో దామోదర్ రావు, కొత్తగూడెం ఆర్డీవో మధుసూదన్, దేవస్థానం ఈవో రమాదేవి, వివిధ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్ట్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన డాక్టర్ చక్రి స్కూల్ విద్యార్థి



**ఖమ్మం, నవభూమి మార్చి 6:** ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ఖమ్మం ముస్తఫా నగర్ లోని డాక్టర్ చక్రి స్కూల్ విద్యార్థి తన ప్రతిభను చాటుకున్నాడు. తెలంగాణ రాష్ట్రం నుండి సెకండ్ లెవెల్ జీకే టాలెంట్ టెస్ట్ లో ఆ పాఠశాల విద్యార్థి సిహెచ్ నీరజ్ కుమార్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. గురువారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ జ్ఞాన సభలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ హ్యాండ్ క్రాఫ్ట్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ రావు చేతుల మీదుగా మెమెంటోను బహుకరించారు. ప్రముఖ మిమిక్రీ కళాకారులు కళారత్న మల్లం రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు అశోక్ కుమార్, సత్య నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో కరెంటు సమస్యలకు చెక్ పెట్టనున్న అధికారులు



**భద్రాచలం మార్చి 6 నవభూమి ప్రతినిధి:** భద్రాచలంలోని కొన్ని కాలనీలలో వేసవి కాలం వస్తే కరెంటు సమస్యలు తలెత్తేవి. ఈ నేపథ్యంలో విద్యుత్ అధికారులు వేసవి సమయంలో ప్రజలకు కరెంటు కష్టాలు లేకుండా వివిధ కాలనీలలో 28 కొత్త ట్రాన్స్ఫార్మర్లను సిద్ధం చేశారు. ఒక కోటి 50 లక్షల నిధులతో 28 ట్రాన్స్ఫార్మర్లను వివిధ కాలనీలలో ఏర్పాటు చేశారు. గురువారం 12 ట్రాన్స్ఫార్మర్లను విద్యుత్ ఉన్నత అధికారులు ఎస్ ఈ దామోదర్, డిఈ జీవన్ కుమార్, ఏఈ రాజారావు తో పాటు విద్యుత్ లైన్ మెన్ లు, సిబ్బంది స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## భూములు ధ్వంసమైన రైతులకు పరిహారం అందించాలి




**గార్ల, నవభూమి, మార్చి 6:** దక్షిణ మధ్య రైల్వే శాఖ నిర్మాణ చేస్తున్న మూడవ లైన్లో భూముల తొవ్వకాల్లో ధ్వంసమైన సేద్యం భూముల రైతులకు నష్టపరిహారం అందించాలని న్యూ డెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జడ సత్యనారాయణ రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. గార్ల మండలం మద్ది వంచ ప్రాంతంలో ధ్వంసమైన రైతుల భూములను న్యూ డెమోక్రసీ బృందం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవ లైన్ నిర్మాణ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ త్రవ్వకాల్లో ఉపయోగం లేకుండా ఉన్న బండరాళ్లను రైతులు సేద్యం చేస్తున్న భూముల్లో వృధాగా వేస్తున్నారని, దీంతో సేద్యపు రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. సేద్యం భూములను నష్ట పోయిన రైతులకు పరిహారం అందించే విధంగా చర్యలు చేపట్టుతామని రెవిన్యూ అధికారులు హామీనిచ్చి రెండేళ్ళు గడుస్తున్న ఏఒక్క రైతుకు పరిహారం అందలేదన్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి ధ్వంసమైన భూముల రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లేని పక్షంలో న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టుతామని సత్య నారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ నాయకులు మల్లేష్, బాబు రావు, రంగారావు, పిచ్చయ్య, శ్రీను, కృష్ణ, చోటే మియా, తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సిందే

- సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్ డిమాండ్








**పాల్వంచ మార్చి 6 నవభూమి ప్రతినిధి:** వివిధ ప్రభుత్వ , ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జరిగిన కలెక్టరేట్ ఆఫీస్ వద్ద ధర్నాలో ఏజే రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న వారికి కనీస వేతనం అమలు చేయాలని అన్నారు . సింగరేణి కాంట్రాక్టు కార్మికులు, అద్దె బస్సు కార్మికులు, పెట్రోల్ బంకు కార్మికులు ,షాపింగ్ మాల్స్ ,ప్యాకింగ్ వర్కర్స్, నర్సరీ కార్మికులు, ప్రైవేటు నర్సింగ్ హెూమ్, బిల్డింగ్ వర్కర్స్, గుమాస్తాలు, ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులు, ట్రాన్స్పోర్ట్ కార్మికులు, వివిధ పని ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతన జీవోను అమలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకు వస్తున్న షెడ్యూల్ పరిశ్రమ కార్మికుల నూతన వేతన సవరణను వ్యతిరేకించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే వేతన జీవన వెనక్కు పంపి కనీస వేతనం 26 %జవశ్రీబ% ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి కేంద్రంలో అధికారంలో వచ్చాక కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తూ ,కార్మికుల శ్రమను అగౌరవపరుస్తుందని ఆయన విమర్శించారు. నెలకు 4,628 రూపాయలు నిర్ణయం చేసి కార్మికులకు ఇవ్వాలని కొత్త వేతన చట్టాన్ని సవరణ చేసి ఇచ్చే ప్రక్రియ ప్రారంభిస్తూ సవరణలు చేస్తుందని, కార్మికుల శ్రమను దోపిడీకి గురి చేసే విధంగా ఈ వేతన పద్ధతిని సవరించి కనీస వేతనం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు ఒక మాట అధికారులకు వచ్చాక మరో మాట మారుస్తూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు పొట్టను కొట్టే నూతన వేతన చట్టాన్ని వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు నినదించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు అసంఘటిత రంగ కార్మికులకు అండగా నిలిచి పోరాటం కొనసాగించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేతనాలు పెంచుతామని కాంట్రాక్టు వర్కర్లకు పర్మినెంట్ చేస్తామని ఈఎస్ఐపిఎఫ్ అమలు చేస్తామని సంక్షేమ పథకాలన్నీ అసంఘటిత కార్మికులకు వర్తింప చేస్తామని ఎన్నికల హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేటికీ ఏ ఒక్కటి అమలు చేయకుండా కాలయాపన చేస్తూ అసంఘటిత రంగ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో సిఐటియు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించిన అనంతరం ఒక కార్మికుడు ఎనిమిది గంటల నుండి 16 గంటల వరకు పని చేస్తున్న క్రమంలో సరిపడ వేతనాలు లేవని తక్కువ వేతనాలతో జీవితం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు కుటుంబం మరోవైపు ఆరోగ్య సమస్యలు పెడుతున్న ఖర్చులకు.. వస్తున్న జీతాలకు ఎక్కడ పొంతనలేదని అసంఘటితరంగా కార్మికులకు అండగా నేటి ప్రభుత్వాలు లేవనేది స్పష్టంగా కనిపిస్తుందనీ ఆయన విమర్శించారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ప్రైవేటు అసంఘటిత రంగ కార్మికులకు 73వ షెడ్యూల్ పరిశ్రమ కార్మికులకు కనీస వేతనం 26 వేలు అమలు చేసే విధంగా వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నా నేడు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కనీస వేతనాలు అమలు చేయకపోతే కార్మికుల అంతా ఐక్యంగా పోరాటం చేసి సాధించుకుంటారన్నారు. లేకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని ఆయన హెచ్చరించారు. ధర్నా అనంతరం జిల్లా కార్మిక శాఖ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ కి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కే సత్య, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ సిఐటియు నాయకులు కత్తి నరసింహ, ప్రదీప్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

- సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ ఉండాలి
- ఎస్పీ రోహిత్ రాజు







**కొత్తగూడెం మార్చి 6 నవభూమి ప్రతినిధి:**-జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం బూర్గంపాడు పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన భాదితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.తక్షణమే విచారణ చేపట్టి భాదితులకు న్యాయం చేకూరేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కంటికి కనపడకుండా ఆన్లైన్ ద్వారా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు.